## ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల రూపకర్తలుగా ఎదగాలి

- సమాచార, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి
- విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సదస్సులో పాల్గొన్న విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా

మొయినాబాద్, మార్చి 6 : ఇంజినీరింగ్ విద్యార్థులు నూతన ఒరవడితో అత్యాధునిక ఆవిష్కరణల రూపకర్తలుగా ఎదగాలని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలో గల విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో విజేఐటీ హైదరాబాద్ కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా స్టేట్ కన్వెన్షన్ ఆన్ జెన్ ఏఐ వారు గురువారం సమాచార, సాంకేతిక, కంప్యూటర్ సైన్స్ రంగంలో వస్తున్న తాజా పరిణామాలపై చర్చించడానికి సదస్సు నిర్వహించారు. సాంకేతిక నిపుణులు, విద్యార్థులు, పరిశ్రమల నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక, సమాచార రంగాల్లో అనేక ఆధునిక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఆ రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా పరుగులు తీస్తూ పరిజ్ఞానం పెంచుకుంటే మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుత తరుణంలో ఎక్కడైనా ఏ రంగంలోనైనా ఉపాధి అవకాశాలు పొందాలంటే తప్పనిసరిగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉలిగి ఉండాల్సిన అవసరం చాలా ఉందని తెలిపారు. సాంకేతిక రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అంశానికి చాలా ప్రాధాన్యత ఉన్నదని, దానిపై విద్యార్థులు కూడా ఎక్కువ ఆసక్తి పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్ ల్యాండ్‌స్కేప్‌లో స్థిరమైన అభ్యాసం మరియు నైపుణ్య అభివృద్ధి చాలా అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొంటూ సాంకేతిక నైపుణ్యం పెంచుకుంటూ ముందుకు వెళ్లినప్పుడే మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సదస్సులో ఆకర్షణీయమైన సాంకేతిక సెషన్లు, పేపర్ ప్రెజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, డిజైన్ ఎ థాన్ అండ్ కోడ్ ఎ థాన్ లాంటి వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో డీబీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిరామ్ బొమ్మరాజు, సీఎస్ఐ హెడ్ చైర్మన్ సుధాకర్, సీఎస్ఐ ప్రతినిధి రాజు, విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మజ, అకాడమిక్ కో ఆర్డినేటర్ శ్రీలత, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటాచలం, ఈవెంట్ కన్వీనర్ అరుణకుమారి, హెచ్ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫెర్టిలైజర్స్ దుకాణదారులతో నిర్వహించిన సమావేశంలోమాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

## రసీదు తప్పనిసరిగా ఇవ్వాలి

జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి

తాండూరు రూరల్, మార్చి 6 : ఎరువుల దుకాణంలో రైతు కొన్న ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్‌కు ఖచ్చితంగా రసీదు ఇవ్వాలని జిల్లా వ్యవసాయధికారి మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో తాండూరు, యాలాల, బషీరాబాద్, పెద్దేముల్ మండలాల ఫెర్టిలైజర్స్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు రైతులను మోసం చేస్తే డీలర్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, పెస్టిసైడ్స్ విక్రయించాలన్నారు. ఎరువుల దుకాణదారులు కచ్చితంగా స్టాక్ బోర్డు, రిజిస్టర్లు, ధరల పట్టిక నోటీసు బోర్డుపై పెట్టాలని సూచించారు. కొంతమంది డీలర్లు మాత్రమే నిబంధనలు పాటిస్తున్నారని, మరికొంతమంది పట్టించుకోవడంలేదన్నారు. తాండూరు ఏడీఏ రుద్రమూర్తి మాట్లాడుతూ.. కోర్టు కేసుల విషయంలో డీలర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇదీ ఏమాత్రం మంచిది కాదన్నారు. కేసులు నమోదైనవారు కచ్చితంగా కోర్టుకు హాజరు కావాల్సిందేనని తెలిపారు. ఏమైనా అనుమానాలుంటే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఎంఏవోలున్నారు.

## ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం

6931 మందికిగాను 6818 మంది హాజరు



సిద్ధార్థ కళాశాలను సందర్శిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, మార్చి 6 : ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష సజావుగా సాగింది. అధికారులు, పోలీసులు విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. ఇంటర్ రెండో సంవత్సరంలో జనరల్ విద్యార్థులు 5725 మందికి 5650., ఒకేషనల్ విద్యార్థులు 1206 మందికి 1,168 మంది పరీక్షలు రాసినట్లు ఇంటర్ నోడల్ అధికారి తెలిపారు. వికారాబాద్‌లోని గౌతమి, కొత్తగడి గురుకుల పాఠశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాలలను వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు. పోలీసులకు సలహాలు, సూచనలు చేశారు. ఎస్పీతోపాటు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ భీమ్‌కుమార్ ఉన్నారు.

## 'మన గ్రోమోర్'తో మొక్కజొన్న పంటకు నష్టం

- పంట రైతును నిండా ముంచిన అట్రాజెన్ మందు
- దెబ్బతిన్న పంటను పరిశీలించిన ఏవో శిరీష



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

కేశంపేట, మార్చి 6 : కేశంపేటలోని మన గ్రోమోర్ దుకాణదారుల నిర్వాకంవల్ల చేతికొచ్చిన మొక్కజొన్న పూర్తిగా దెబ్బతిన్నది. మండల పరిధిలోని లేమామిడి గ్రామానికి చెందిన శ్రీధర్‌రెడ్డి అనే రైతు గ్రామంలోని సర్వే నంబర్ 250, 251లలో 5 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. విత్తనాలు విత్తిన నెల రోజుల తర్వాత చేనులో కలుపు అధికమవడంతో కేశంపేటలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణం వద్దకు వెళ్లి మొక్కజొన్న పంటలో కలుపు అధికంగా ఉందని.. మందు కావాలని నిర్వాహకులను కోరాడు. దుకాణదారుడు అట్రాజెన్ (ఫ్లక్స్ 500జీ) మందు ఇచ్చాడని, దానిని తీసుకొచ్చి మొక్కజొన్న పంటకు పిచికారీ చేయగా రోజురోజుకూ మొక్కజొన్న పంట క్షీణిస్తూ పూర్తిగా దెబ్బతిన్నది. ఈ విషయమై మన గ్రోమోర్ నిర్వాహకులను సంప్రదించగా.. అట్రాజెన్ రసాయన పరిశ్రమ నిర్వాహకులకు సమాచారం చేరవేశారు. సంఘటనా స్థలాన్ని రసాయన ఎరువుల సంస్థ ప్రతినిధులు ఈ నెల 5న పంటను పరిశీలించి పొంతనలేని సమాధానం చెప్పారు. మొక్కజొన్న పంటను తీసేసి టమాట వేసుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మన గ్రోమోర్‌తోపాటు అట్రాజెన్ రసాయన ఎరువు తయారీ సంస్థపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయనున్నట్లు రైతు తెలిపాడు.

పంట దెబ్బతిన్న విషయమై వ్యవసాయశాఖ అధికారులకు రైతు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు గురువారం క్షేత్ర ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా లేమామిడి గ్రామానికి చేరుకొని రైతు శ్రీధర్‌రెడ్డి సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. పంట 50 శాతం దెబ్బతిన్నదని, అట్రాజన్ మందును విత్తనాలు విత్తిన 24 గంటల వ్యవధిలోపల పిచికారీ చేయాలని, విత్తనాలు నాటిన నెల రోజుల తర్వాత పిచికారీ చేయడంవల్ల పంట దెబ్బతిన్నట్లు శాస్త్రవేత్తల ప్రాథమిక అంచనాలతో గుర్తించామని ఏవో శిరీష తెలిపారు. పంట దెబ్బతిన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వివరించారు. కార్యక్రమంలో ఏఈవోలు సుధ, నిఖిల్ పాల్గొన్నారు.

## ఘనంగా 'బయో అధ్యయన్ 2కె25' జాతీయస్థాయి సదస్సు



విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను తిలకిస్తున్న అతిథులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 6 : ఫార్మా రంగానికి రాబోయే రోజుల్లో అపారమైన అవకాశాలున్నాయని కాకతీయ యూనివర్సిటీ విశ్రాంత రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, డిప్యూటీ డగ్స్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా సీడీఎస్‌సీవో జోనల్ ఆఫీస్ హైదరాబాద్ డాక్టర్ రాంకిషన్ అన్నారు. గుంతపల్లిలోని అవంతి ఔషధ కళాశాలలో 'బయో అధ్యయన్ 2కె25' పేరుతో గురువారం నిర్వహించిన జాతీయస్థాయి అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై అతిథులు రామలింగేశ్వరరావు, డాక్టర్ రాజ్‌గోపాల్‌శర్మ, ప్రొఫెసర్ బల్‌రాంఘోష్, డాక్టర్ జీవీ ప్రతీక్, కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ఔషధ అవసరం, అనవసరం, దుర్వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను పరిశీలించి తయారు చేసిన విధానాలను వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రియాంక, హెచ్ఆర్ డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డా.బాలాజీ, పీఆర్వో శ్రీనివాస్‌నాయుడు, అధ్యాపకులున్నారు.

## ఇఫ్లూ వీసీగా ప్రొఫెసర్ నాగరాజు



ఉస్మానియా యూనివర్సిటీ : ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ) నూతన వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ నాగలపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు కేంద్ర విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో ఐదేళ్లు గానీ, ఆయనకు 70 ఏళ్ల వయసు వచ్చేవరకుగానీ (ఏది ముందైతే అది) ఉండనున్నారు. ఇంగ్లిష్ సాహిత్యం విభాగానికి చెందిన ఆయన ప్రస్తుతం ఒడిశాలోని గంగాధర్ మెహర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా సేవలు అందిస్తున్నారు. ఆయన సుదీర్ఘకాలం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకలో అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ ఈవినింగ్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఈవినింగ్ కోర్సుల సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను www.osmania.ac.inలో చూసుకోవాలని ఆయన సూచించారు.

## అత్యాశపడి.. మోసపోయి..

- రూ.5లక్షలు లోను మంజూరైందని ఫోన్‌కాల్ ద్వారా సైబర్ నేరగాడు బురిడీ
- రూ.45,490 ఫోన్‌పే పంపి మోసపోయిన బాధితుడు





యాచారం, మార్చి 6 : అత్యాశకు పోయి గుర్తు తెలియని దుండగుడి చేతిలో మోసపోయాడో వ్యక్తి. రూ.5లక్షలు ముద్ర లోను మంజూరైందని, అది పొందాలంటే ముందుగా కొంత నగదు చెల్లించాలని ఓ సైబర్ నేరగాడు రెచ్చి పోయాడు. అతడు చెప్పిన మాయమాటలు నమ్మి ఆ వ్యక్తి నట్టేట మునిగాడు. దుండగుడు అడిగిన నగదును ఏమాత్రమూ ఆలోచించకుండా ఫోన్‌పే ద్వారా పంపించాడు. లోన్ కోసం ఆరా తీయగా.. స్పందించకపోవడంతో తాను గుర్తు తెలియని వ్యక్తి చేతిలో మోసపోయినట్లు గుర్తించాడు. చివరకు చేసేదేమీలేక గురువారం పోలీసులను ఆశ్రయించి తనకు న్యాయం చేయాలని కోరాడు. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గ్రామంలో జరిగింది.

సీఐ నందీశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గున్‌గల్ గ్రామానికి చెందిన రామప్ప(37) అనే వ్యక్తికి గత ఫిబ్రవరి 4న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ కాల్ చేశాడు. నీకు ముద్ర లోన్ ద్వారా రూ.5లక్షలు మంజూరయ్యాయని తెలిపాడు. లోన్ పొందాలంటే ముందుగా కొంత నగదును చెల్లించాలని అతడు సూచించాడు. దీనికిగాను తాను ఒక స్కానర్ పంపిస్తానని.. దానికి క్యూఆర్ కోడ్ ద్వారా తగిన డబ్బులు చెల్లించాలని రామప్పను బురిడీ కొట్టించాడు. రూ. 5లక్షల లోన్‌కు ఆశపడిన రామప్ప విడతలవారీగా రూ.45,490 ఫోన్‌పే ద్వారా పంపించాడు. తరువాత లోన్ విషయమై ఫోన్ చేయగా అతడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దాంతో తాను మోసపోయినట్లు గుర్తించాడు. నెల రోజులుగా ఎంతో మనోవేదనకు గురయ్యాడు. చివరకు చేసేదేమీలేక యాచారం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి జరిగిన మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాచకొండ పోలీస్ కమిషనర్ పిలుపు మేరకు నిత్యం ఏదో ఒక ప్రాంతంలో సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నటికీ ప్రజలు నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని సీఐ నందీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. యాచారంలో సైకిల్ పెట్రోలింగ్ ద్వారా సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని, అనుమానంగా ఉన్న వ్యక్తులను అస్సలు నమ్మొద్దని సూచించారు. కాల్స్ వస్తే వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని, లేదా నేరుగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# చెత్త తరలింపులో దుబారా..!

వాహనాల డీజిల్, మరమ్మతుల పేరిట అక్రమాలు

నకిలీ బిల్లులు పెడుతూ ఖజానాకు గండిపడుతున్నా పట్టని అధికారులు





సిటీబ్యూరో, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : బల్దియాలో ఆర్థిక కష్టాల్లో కార్పొరేషన్ ఉందని చెబుతూనే మరోవైపు అనవసర ఖర్చులను పెంచి పోషిస్తున్నారు. అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వచ్చినా వాటికి ఫుల్‌స్టాప్ పెట్టడంలేదు. చెత్త తరలింపునకు 268 మినీ టిప్పర్లు వినియోగిస్తుండగా.. అందులో 150 పాతవి.. వీటి నిర్వహణ డీజిల్, మరమ్మతుల పేరిట ఏటా రూ. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయితే చాలా వరకు 15 ఏండ్లు దాటిన టిప్పర్లు ఉన్నాయి. వీటిని స్క్రాప్‌కు పంపించి కొత్త వాహనాలను కొనుగోలు చేయాల్సిన అవసరం ఉన్నది. కానీ ఈ దిశగా చర్యలు చేపట్టడంలేదు. ఫలితంగా సంస్థ ఖజానాకు నష్టం వాటిల్లుతున్నది. ఈ టిప్పర్ల వినియోగంలో డీజిల్ దోపిడీ ఒక్కటే కాదు.. చాలా వరకు మరమ్మతుల పేరిట కొందరు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పాత టైర్లు వేసి కొత్త టైర్లు వేసినట్లు బిల్లులు పెట్టడం.. రిపేర్లలో వినియోగించే సామాన్లు సైతం అధిక మొత్తంలో బిల్లులు పెట్టి ఖజానాను గండికొట్టడం లాంటి ఘటనలు లేకపోలేదు.

### అధికారుల వాహనాలు సైతం

కమిషనర్ నుంచి అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషన్ల వరకు ఇన్నోవా వాహనాలను వినియోగిస్తుండగా.. డిప్యూటీ కమిషనర్లు, కొందరు ఇంజినీర్లకు బొలేరో వాహనాలను వాడుతున్నారు. ఐతే బొలేరో వాహనాలు చాలా వరకు 15 ఏండ్లకు పైబడినవే ఉన్నాయి. వీటి నిర్వహణలోనూ అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### పర్యవేక్షణ కరువు

జీహెచ్ఎంసీలో దాదాపు 38 స్వీపింగ్ మిషన్లు ఉండగా.. వీటిలో 17 వాహనాలు జీహెచ్ఎంసీకి చెందినవి. కాలపరిమితి ముగియడంతో పక్కన పడేశారు. ప్రస్తుతం సుమారు 18 వెహికల్స్ అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. అద్దె ప్రాతిపదికన ఏజెన్సీలకు ఒక్కో వాహనానికి ఏడాదికి రూ. కోటీ 13 లక్షలకు పైగా చెల్లిస్తున్నారు. ప్రతి ఏటా వీటి కోసం రూ.20కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఈ స్వీపింగ్ యంత్రాలతో ఒక్కో మిషిన్ 40 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వరకు క్లీన్ చేయాలి. కానీ కొన్ని ఏజెన్సీలు సగం కిలోమీటర్లు కూడా చేయకుండా బిల్లులు క్లెయిమ్ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు నగరంలోని వీఐపీలు ఉండే ప్రాంతాల్లోనే తప్ప కమర్షియల్ కారిడార్లు, ప్రధాన రహదారులపై మాత్రం కనిపించడం లేదని కార్మిక సంఘాల నేతలు వాపోతున్నారు. అన్నింటి కంటే ముఖ్యంగా జీహెచ్ఎంసీకి సంబంధించి రెండు స్వీపింగ్ మెషిన్లు హెచ్‌జీసీఎల్ (హెచ్ఎండీఏ ఔటర్ విభాగం)కు అప్పగించగా.. తిరిగి హెచ్‌జీసీఎల్ నుంచి జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోన్‌కు వచ్చిన వాటిని పూర్తిగా పక్కకు పెట్టడం అధికారుల పనితీరుకు గమనార్హం.

## పేద హృదయాలను హత్తుకుంటూ.. ఆదర్శంగా నిలుస్తున్న మహిళామణులు



పేద హృదయాలను హత్తుకొంటూ.. కొందరు మహిళా ఉద్యోగులు సామాజిక సేవలో నిమగ్నమవుతున్నారు. నిరుపేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. అభాగ్య మహిళలకు ఉపాధినిచ్చి బాసటగా నిలుస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ మహిళామణులపై ప్రత్యేక కథనం.. - సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ):

### అన్ని వసతులతో చదువుకునేలా..



ఆమె పేరు దుర్గాకల్యాణి. ఐటీ ఉద్యోగి. సర్కార్ స్కూల్ పిల్లలు ప్రయివేట్ స్కూల్స్ మాదిరిగానే అన్ని వసతులతో చదువుకునేలా తన వంతుగా సాయం అందిస్తూ పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని అమీన్‌పూర్-పటేల్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో 60 మంది విద్యార్థులకు లక్ష రూపాయల విలువజేసే 22 బెంచీలను అందించారు. బట్టలు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. తమ జగతి ఫౌండేషన్‌ను సంప్రదిస్తే సేవలు అందిస్తామని ఆమె తెలిపారు.

### ఆకలితో ఎవరూ ఉండొద్దని..



ఆమె పేరు పావని. ఫార్మా కంపెనీలో ఉద్యోగం. తనకు వచ్చే జీతంలో 25 శాతం సహాయ కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. 'ఆకలితో ఎవ్వరైనా బాధపడితే నేను తట్టుకోలేను. సమాజ శ్రేయస్సు కోసం జరిగే ప్రతీ కార్యక్రమంలో నా పాత్ర ఉండాలని అనుకుంటా. ఆకలితో బాధపడే వారు రోడ్లపై కనిపిస్తే మా 8688577703 నంబర్‌కు ఫోన్ చేస్తే వారికి ఆహార పాకెట్లు అందిస్తా' అని అన్నారు.

### సేవలోనే సంతృప్తి వెతుక్కుంటూ..



ఆమె పేరు డాక్టర్ సాజిదాఖాన్, దేశంలోనే మొదటి మహిళా సౌండ్ ఇంజినీర్. ఎంత బిజీగా ఉన్నా ఆమె సామాజిక సేవ కోసం సమయం కేటాయిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వెళుతూ బాలికల ఆరోగ్యం, అవసరాలు తెలుసుకుంటూ అండగా నిలుస్తున్నారు. ప్రతి నెల 150 మంది వితంతువులకు ఫయాజ్‌చారి ట్రబుల్ ట్రస్ట్ ద్వారా వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. సురక్ష మిషన్ ద్వారా బాలికల ఆశ్రమంలో వారికి అత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. 9059695714 నంబర్‌కు ఫోన్ చేస్తే మాకు వీలైనంత సాయం అందిస్తామన్నారు.

### సేవతో కనెక్ట్ అవుతాం..!





ఆమె పేరు రీనా హిండొక. టచ్ ఏ లైఫ్ ఫౌండేషన్‌తో మురికివాడల్లో నివసించే బాలికలతో కనెక్ట్ అవ్వడం, వారి ఆరోగ్య, స్థితిగతులను తెలుసుకోవడం.. పోషకాహారం గురించి వారు ఎదుర్కొంటున్న సవాళ్లను, సమస్యలను అర్థం చేసుకొని బాసటగా నిలుస్తున్నారు. 'విరియా' (సరైన ప్రయత్నం)థీమ్‌తో అర్హులైన అమ్మాయిలకు ఉన్నత చదువుల కోసం స్కాలర్ షిప్‌లను సైతం అందిస్తారు. ఎంపికైన ప్రతి అమ్మాయి పేరుపై సేవింగ్స్ బ్యాంక్ ఖాతాను కూడా అందిస్తారు. ఆరోగ్య బీమా, ఇంటర్నెట్ కనెక్టివిటీతో కూడిన ల్యాప్ టాప్. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, ఆర్థిక, డిజిటల్ సమ్మిళితం వంటి అన్ని రంగాల్లో ప్రతి అమ్మాయికి సాధికారత కల్పిస్తున్నదీ ఫౌండేషన్.

# నిధులివ్వరా.. నేరాల కట్టడి ఎట్లా?

- స్టేషనరీ నుంచి డీజిల్ వరకు అంతా పోలీసులే..
- ఒక్క రూపాయి విడుదల చేయని ప్రభుత్వం.. అయోమయంలో పోలీసులు
- స్టేషన్‌కు వచ్చేవారిపై ఆధారపడే పరిస్థితి..
- బీఆర్ఎస్ హయాంలో పీఎస్‌ల నిర్వహణ భేష్..
- గత ప్రభుత్వ హయాంలో రెగ్యులర్‌గా నిధుల విడుదల
- మళ్లీ గత వైభవం వస్తుందా అంటున్న పోలీసులు

సిటీబ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్ పోలీస్ స్టేషన్ల నిర్వహణ ఖర్చును ప్రభుత్వమే భరించాల్సి ఉండగా కొన్నినెలలుగా ఒక్క పైసా విడుదల చేయడంలేదు. దీంతో స్టేషన్‌లో చిన్న గుండుసూది మొదలు.. డీజిల్ వరకు సొంతంగా భరించాల్సి రావడంతో పోలీసులు అయోమయంలో పడిపోతున్నారు. ఒకవైపు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల వద్ద ఒక్కరూపాయి కూడా తీసుకోవద్దని చెబుతున్న ప్రభుత్వం స్టేషన్ నిర్వహణ కోసం మెయింటెనెన్స్ నిధులు మాత్రం ఇవ్వడం లేదు. గత పదేళ్లలో ఎప్పుడూ లేని దుస్థితి ఇప్పుడు వచ్చిందని పోలీసులే బహిరంగంగా విమర్శిస్తున్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలీస్‌స్టేషన్ల నిర్వహణకు ప్రభుత్వాలు ఎలాంటి నిధులు ఇచ్చేవి కావు. దీంతో పోలీసులు ఎంతో కొంత ఫిర్యాదుదారుల నుంచి వసూలు చేయాల్సి వచ్చేది. ఈ దుస్థితి ఉండొద్దని తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పాటైన కేసీఆర్ సర్కార్ ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు స్థాయిలను బట్టి మెయింటెనెన్స్ కింద నిధులు కేటాయించింది. దీంతో పీఎస్ ఖర్చుల కోసం ఫిర్యాదుదారులను పీడించడం తగ్గిపోయింది. కానీ మళ్లీ పోలీసుల అవస్థలు, ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు తీసుకోవడాలు ఈ ప్రభుత్వం వచ్చాక మొదలయ్యాయి.

### తమ జేబులనుంచే పెట్టుకోవాలి..!



హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 71 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో కొన్ని కొత్తవి కాగా ప్రతీ పోలీస్ స్టేషన్‌కు నెలవారీ నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.75 వేలు ప్రభుత్వం విడుదల చేయాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పీఎస్‌ల మెయింటెనెన్స్ ఖర్చుల విషయంలో ఎప్పుడూ వెనకాడలేదు. నిధులు ఎప్పటికప్పుడు విడుదల చేయడం వల్ల పోలీసులు తమ స్టేషన్ల నిర్వహణ కోసం వేరేవారిపై ఆధారపడకుండా ఉండేవారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న పరిస్థితి మళ్లీ తలెత్తిందని స్వయంగా పోలీసులే చెబుతుండటం గమనార్హం. ప్రధానంగా నగరంలోని కమర్షియల్ డివిజన్ పరిధిలో ఉన్న రెండు పోలీస్ స్టేషన్‌లలో నిరంతరం వీఐపీల రద్దీ కొనసాగుతుంది. ఇక్కడికి వచ్చే ఫిర్యాదుదారుల కంటే వీఐపీలు, ఉన్నతాధికారులే ఎక్కువగా వస్తుండటంతో మెయింటెనెన్స్ తడిసి మోపెడవుతున్నది. అసలే మెయింటెనెన్స్ రాక తలలు పట్టుకుంటుంటే వచ్చేవారికి మర్యాదలు చేయాల్సి రావడం.. ఒకవేళ వారిని పట్టించుకోకపోతే తమ పై అధికారులు ఎలా స్పందిస్తారో తెలియక స్టేషన్ ఆఫీసర్లు ఆందోళన చెందుతున్నారు. తమ జేబుల నుంచి ఈ మెయింటెనెన్స్ పెట్టుకోవలసిన పరిస్థితి వస్తున్నదని చెబుతున్నారు.

### స్టేషనరీ మొదలు డీజిల్ వరకు..!

కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత ప్రతీనెలా పోలీస్‌స్టేషన్లకు మెయింటెనెన్స్‌రాక పోలీసులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. డీజిల్ కోసం పెట్రోల్ బంక్‌లకు వెళ్లి ఖాతా పెడుతున్నారు. అయితే ఈ మెయింటెనెన్స్ కూడా స్టేషన్‌కు వచ్చే వారి దగ్గరి నుంచో లేక ఎవరైనా లీడర్లు పీఎస్ నిర్వహణకు ఉంచుకోండంటూ ఇస్తేనో పెట్టుకోవలసి వస్తున్నది తప్ప ప్రభుత్వం నుంచి పైసా రావడం లేదని.. తాము దర్యాప్తు జరపాలంటే కూడా కష్టమవుతుదని పోలీసులు వాపోతున్నారు. పెండింగ్ కేసులు పెరుగుతున్నాయంటూ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు.. నిందితులను పట్టుకోలేరా అంటూ చీవాట్లు.. వీటన్నిటికీ కారణం ఒక్కటే డబ్బులు లేకపోవడం. తాము నిందితుల కోసం గాలించే సమయంలో డబ్బులిస్తాం.. మీరు పెట్టుకోండంటూ చెప్పి ఆ తర్వాత ఇవ్వకపోవడంతో దర్యాప్తు ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతున్నదని ఒక పోలీస్ అధికారి చెప్పారు. తమను డబ్బులు తీసుకోవద్దంటూనే ఇంత ఖర్చెలా భరించాలో ప్రభుత్వమే చెప్పాలంటూ ప్రశ్నించారు. నిధుల విడుదల విషయంలో ప్రభుత్వ అలసత్వం పోలీస్ శాఖకు మచ్చ తెచ్చేలా ఉందని వారు బాధపడుతున్నారు.